సాక్షి
మంచిర్యాల
శనివారం । 16 । మార్చి । 2024



టూరిజం స్పాట్‌గా జోడేఘాట్

జోడేఘాట్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ఆమె జోడేఘాట్‌ను సందర్శించి కుమురంభీమ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. 11లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:27	ఆది : 5:01

గరిష్టం/కనిష్టం
36.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పాతమంచిర్యాల: ఈ నెల 18నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతీ కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించామని తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు 9గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 9,637మంది పరీక్షలకు హాజరు కానున్నారని, పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించామని, ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల తరలింపు కోసం బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షల విషయంలో సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబరు 7032463114లో సంప్రదించాలని తెలిపారు.

హెచ్ఐవీ ఇండికేటర్స్‌పై శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఆరోగ్య సిబ్బందికి హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లోని హెచ్ఐవీ ఇండికేటర్స్‌పై శుక్రవారం జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జీసీ.సుబ్బరాయుడు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచించిన 45 కీలక ఇండికేటర్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం హెచ్ఐవీ, లైంగిక సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత, దిశా సిబ్బంది నీలిమ, రమేశ్, సంతోశ్, అనిల్, డెమో వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్ఎం డీపీవో ప్రశాంతి, డీడీఎం ప్రవళిక పాల్గొన్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఇళ్ల పట్టాల పంపిణీకి శనివారం ముహూర్తం ఖరారైంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఆఘమేఘాలపై లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై పట్టాలు అందజేస్తారు. జేసీబీ వాహనాన్ని ప్రారంభిస్తారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన వెంటనే పట్టాలు పంపిణీ చేయాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసి తీరా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీకి కొద్దిగంటల ముందు పంపిణీకి సిద్ధమయ్యారు.

బీసీ కార్పొరేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కార్పొరేషన్లకు చట్టబద్ధత కల్పించి పాలక మండళ్లు ఏర్పాటు చేయాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఎనిమిది బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని అన్నారు. కార్పొరేషన్లకు రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, జైపాల్‌సింగ్, శ్రీనివాస్, తిరుపతి, దీపాంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్‌పై ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ పి.రవీందర్‌రెడ్డిపై బెల్లంపల్లి సివిల్ కోర్టులో డాక్టర్ కొండగొర్ల చంద్రశేఖర్ ఫిర్యాదు దాఖలు చేసిన మేరకు ఆఫీస్ ఆఫ్ ది చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, తెలంగాణ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ చర్యలకు ఉపక్రమించింది. ఎన్నికల నియమావళి ప్రకారం ఒకే జిల్లాకు చెందిన డిప్యూటీ డైరెక్టర్ ఐదేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్నారని, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బదిలీ కాకుండా రాజకీయ పలుకుబడిని వినియోగించినట్లుగా ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర ఎన్నికల ఆఫీసర్ వికాస్‌రాజ్ రవీందర్‌రెడ్డిపై ఈసీఐ సూచనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

లోక్‌సభకు సిద్ధం!



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్(ఫైల్)

- అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- షెడ్యూల్ ప్రకటనకు ముందే సన్నద్ధం
- పార్లమెంటు ఎన్నికల సమరానికి ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా జరగబోయే పార్లమెంటు, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేయనున్న నేపథ్యంలో అప్రమత్తమైంది. షెడ్యూల్ విడుదలైతే కోడ్ అమల్లోకి రానున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌కు సంబంధించి ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి(ఆర్వో)గా పెద్దపల్లి కలెక్టర్ ఉండే అవకాశం ఉంది. అధికార యంత్రాంగమంతా ఆర్వో పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఓటర్ల సంఖ్య పెంపు

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికార యంత్రాంగమంతా అన్ని రకాల శిక్షణలు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే గెజిటెడ్ స్థాయి అధికారి నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు బదిలీలు జరిగాయి. స్థానికత, మూడేళ్ల సర్వీసు పూర్తి తదితర నిబంధనల ప్రకారమే ప్రస్తుతం అధికారులు ఉన్నారు. జిల్లాలో చాలావరకు కొత్త అధికార యంత్రాంగమే ఉంది. ఎన్నికల్లో పారదర్శకత, నిష్పక్షపాతంగా పని చేసేందుకు ఈ ఏర్పాట్లు చేశారు. ఈవీఎంల ర్యాండమైజేషన్లు, పరిశీలనలు చేపట్టారు. ఇక ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి తుది జాబితా ప్రకటించారు. 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి హక్కు కల్పించారు. గత ఎన్నికల్లో ప్రతీ పోలింగ్ కేంద్రానికి 1500మంది ఓటర్ల ఉండగా, అదనంగా మరో వందమంది వరకు పెంచి, 1600మంది ఓటర్ల వరకు ఓటేసేందుకు వీలు కల్పించారు.

సౌకర్యాల కల్పన

పోలింగ్ కేంద్రాల పెంపు, ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో ట్యాగింగ్, పోల్ చీటీపై మ్యాపింగ్, ఫొటోలతో కూడిన ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్, ప్రత్యేక బృందాల ఏర్పాట్లు, కమిటీలను నియమించారు. ఇక ఎన్నికల విధుల కోసం ఇప్పటికే ఆయా శాఖాల నుంచి అధికారుల జాబితా వెళ్లాయి. నిబంధనల మేరకు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు విధులు కేటాయించనున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

పోలీసు శాఖ అప్రమత్తం

ఎన్నికలకు ముందుగానే పోలీసు శాఖ భద్రతపరంగా అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ అందించారు. కోడ్ అమలు నుంచి పోలింగ్, లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అత్యంత కీలకమైన శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో పరిధిలో నిర్వర్తించాల్సిన విధులపై రూట్‌మ్యాప్ తయారు చేశారు. వామపక్ష, ప్రభావిత, సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. అంతర్రాష్ట్ర, జిల్లాల పోలీసులు సమీక్ష సమావేశాలు నిర్వహించారు.

నియోజకవర్గాల వారీగా ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	మొత్తం
మంచిర్యాల	1,38,472	1,40,559	2,79,056
బెల్లంపల్లి	86,802	88,530	1,75,345
చెన్నూర్	95,974	97,264	1,93,245



జిల్లాలో గుర్తించిన ప్రత్యేక ఓటర్లు

వయస్సు	ఓటర్లు(మంది)
18-19	17089
20-29	1,33,528
దివ్యాంగులు	10,297
వృద్ధులు	7,971
సెక్స్‌వర్కర్లు	2171
పీవీటీజీలు	904
ట్రాన్స్‌జెండర్లు	45

జిల్లాలో ఈవీఎంలు

బ్యాలెట్ యూనిట్లు	1074
కంట్రోల్ యూనిట్లు	963
వీవీ ప్యాట్లు	1080

బల్దియాకు అద్దె ఎగవేత

అక్రమంగా నిర్మించి అద్దె వసూలు



ఈ గది మున్సిపాల్టీ నిర్మించింది కాదు. మార్కెట్‌లోని మున్సిపల్ దుకాణ సముదాయంలో మొదటి అంతస్తులోని దుకాణాలకు వెళ్లేందుకు మెట్ల కింద అక్రమంగా గోడలు నిర్మించి గదిగా మార్చారు. నెలకు రూ.10వేలకు అద్దె వసూలు చేస్తున్నారు. మాజీ కౌన్సిలర్ పాత్ర ఉండడంతో అక్రమంగా గది నిర్మించినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ ఆదాయాన్ని తీసుకుంటున్నా పట్టింపు లేదు. ఇదే సముదాయంలో లీజుకు తీసుకున్న దుకాణాలను ఇతరులకు అధిక ధరకు ఇచ్చి ప్రతీ నెల అద్దె వసూలు చేస్తూ బల్దియాకు చెల్లించాల్సింది ఏళ్ల తరబడి చెల్లించడం లేదు. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో గతంలో నిర్వహించిన కళాశాల యాజమాన్యం రూ.46.08లక్షలు అద్దె చెల్లించకపోయినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

- మున్సిపల్ దుకాణాలు అధిక అద్దెకు ఇతరులకు..
- ఎగవేతదారుల్లో మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు
- రూ.2.10కోట్లు మొండి బకాయిలు



మార్కెట్‌లోని ఈ షాపింగ్ కాంప్లెక్సులో రూ.1.05 కోట్ల అద్దె బకాయిలు రావాల్సి ఉంది

మున్సిపాలిటీలోని మున్సిపల్ దుకాణాలు, అద్దె బకాయిలు, వసూళ్లు (రూ.లలో)

షాపింగ్ కాంప్లెక్సు	దుకాణాల సంఖ్య	రావాల్సిన అద్దె	వసూలైంది	పెండింగ్
మార్కెట్ ఏరియా	25	1.23 కోట్లు	17.89 లక్షలు	1.05 కోట్లు
బల్దియా కార్యాలయం పక్కన	23	87.68 లక్షలు	7.28లక్షలు	80.40 లక్షలు
వాటర్ ట్యాంక్	9	27.66 లక్షలు	3.21 లక్షలు	24.44 లక్షలు
మార్కెట్ ఏరియా	1	2.88 లక్షలు	2.16 లక్షలు	72 వేలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీ పరిధిలోని మున్సిపల్ దుకాణ సముదాయాల అద్దె రూ.కోట్లలో పేరుకుపోతోంది. దుకాణాలు పొందిన యజమానులు వాటిని ఇతరులకు సబ్ లీజుకు ఇచ్చి రెట్టింపు అద్దె వసూలు చేస్తున్నారు. మున్సిపాల్టీకి మాత్రం ఎగవేస్తుండడంతో బకాయి పెరిగిపోతోంది. దుకాణాలు అద్దెకు తీసుకున్న వారిలో మాజీ కౌన్సిలర్లు ఉండడం, బకాయిలు చెల్లించకపోవడం గమనార్హం. బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నా నోటీసులు జారీ చేయడం లేదు. ఇంటి పన్ను చెల్లించని వారికి మున్సిపల్ సిబ్బంది నోటీసులు జారీ చేస్తూ వసులు చేస్తుండగా.. అద్దె వసూలు విషయంలో చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నాలుగు దుకాణ సముదాయాలు

పట్టణంలో మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన నాలుగు దుకాణ సముదాయాలు ఉన్నాయి. వీటి ద్వారా 2024 మార్చి ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి పాత బకాయిలు కలిపి రూ.2.39 కోట్లు అద్దె రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.28.40 లక్షలు మాత్రమే వసూలైంది. రూ.2.10 కోట్లు అద్దె వసూలు చేయాల్సి ఉండగా, గడువు ఇంకా 15 రోజులు మాత్రమే ఉంది. దుకాణాలు అద్దెకు తీసుకున్న వారిలో ఎక్కువగా అప్పటి అధికార పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్ల కుటుంబ సభ్యులే ఉన్నారు. దీంతో అద్దె చెల్లించకపోయినా బిల్ కలెక్టర్లు వదిలేశారు. సగానికి పైగా దుకాణాలను లీజుకు తీసుకుని, ఇతరులకు రెట్టింపు ధరలకు అద్దెకు ఇవ్వడం, బకాయిల కోసం వెళ్లిన సిబ్బందికి లీజుదారులు లేకుండా, కిరాయిదారులే ఉండడం కూడా ఇబ్బందిగా మారుతోంది. అద్దె చెల్లించని దుకాణాలకు నోటీసులు అందించి, తాళాలు వేస్తామని ఇటీవల హెచ్చరించగా ఎంతమేరకు అద్దె వసూలు అవుతుందో చూడాలి.

ఇక వాహనాలకు టీజీ

- టీఎస్ నుంచి మారుస్తూ ఉత్తర్వులు
- 'టీజీ19 0001'గా సిరీస్‌తో నంబర్ జారీ
- ప్రారంభమైన టీజీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇకపై వాహనాల టీఎస్‌కు బదులు టీజీ అని కనిపించనుంది. ఇప్పటి వరకు టీఎస్ సిరీస్‌పై వాహనాల రిజిస్ట్రేషన్లు కాగా శుక్రవారం నుంచి రవాణా శాఖ టీజీగా రిజిస్ట్రేషన్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో టీఎస్ స్థానంలో టీజీగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నిన్నటి వరకు రిజిస్ట్రేషన్లు అయిన వాహనాలతోపాటు ముందస్తుగా నంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు, బిడ్డింగ్‌లో పాల్గొన్న వారికి పాత సిరీస్ ప్రకారం టీఎస్ సిరీస్‌తో నంబరు ప్లేట్ ఇస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాహనాల రిజిస్ట్రేషన్ సిరీస్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చాలని విన్నవించిన మేరకు కేంద్రం తాజాగా ఆమోదం తెలపడంతో టీజీ రిజిస్ట్రేషన్ సిరీస్ ప్రారంభమైంది. జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో ప్రతీ రోజు 50కిపైగా వివిధ రకాల వాహనాల రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. 15వ తేదీ గురువారం వరకు 'టీఎస్ 19జే 6000' నంబర్ వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం నుంచి 'టీజీ 19 0001' నుంచి సిరీస్‌తో ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తంగా ద్విచక్ర వాహనాలు 2.20లక్షల వరకు ఉండగా, కార్లు 22 వేల వరకు ఉన్నాయి. మొత్తంగా అన్ని రకాల వాహనాలు 2.85లక్షల వరకు ఉన్నాయి.

మూడు రకాల సిరీస్‌తో నంబర్ ప్లేట్లు..

జిల్లాలో ఇకపై వాహన మూడు రకాల సిరీస్‌లతో నంబరు ప్లేట్లు కనిపిస్తాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఏపీ సిరీస్‌తో వాహనాల నంబర్ ప్లేట్లు ఉండేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో టీఎస్ సిరీస్‌తో నంబర్ ప్లేట్లు వచ్చాయి. ఇప్పుడు టీజీ సిరీస్‌కు మార్చడంతో ఇకపై జిల్లాలో టీజీ సిరీస్ నంబర్ ప్లేట్లు దర్శనమివ్వనున్నాయి. మొత్తంగా ఏపీ, టీఎస్, టీజీ అనే మూడు రకాల సిరీస్ వాహనాలు కనిపించనున్నాయి. నూతన వాహన రిజిస్ట్రేషన్‌లతోపాటు ముందస్తు రిజిస్ట్రేషన్ నంబర్ రిజర్వేషన్, ఆన్‌లైన్ బిడ్డింగ్ చేసే వారికి టీజీ సిరీస్‌తో నంబర్ ప్లేట్లు జారీ అవుతాయని మంచిర్యాల ఇంచార్జీ డీటీఓ సంతోశ్ తెలిపారు.

'ఉమ్మడి ఆదిలాబాద్'ను అగ్రగామిగా నిలపాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క, వేదికపై జిల్లాల కలెక్టర్లు

- ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నాలుగు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయితీరాజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత పెడదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వయం ఉపాధి, తదితర రంగాల్లో రాణించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, డీడబ్ల్యూవో శాఖల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా పచ్చదనంతో కళకళలాడాలన్నారు. నాలుగు జిల్లాల ఉన్నతాధికారులు సమష్టిగా పనిచేస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిశ్ సాంగ్వాన్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బి.సంతోష్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దొత్రే, నాలుగు జిల్లాల ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పీపుల్స్ మార్చ్'కు ఏడాది

- ఉమ్మడి జిల్లా నుంచే 'భట్టి' పాదయాత్ర
- నాడు సీఎల్పీ నేత.. నేడు డిప్యూటీ సీఎంగా పిప్రికి రాక



పాదయాత్రలో నాయకులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 'హాథ్ సే హాథ్ జోడో'లో భాగంగా చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రకు నేటికి ఏడాది పూర్తయింది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు అప్పటి సీఎల్పీ నేతగా ఉన్న భట్టి మార్చి 16 నుంచి జూలై 2వరకు పాదయాత్ర చేశారు. మొదటగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని బోథ్ నియోజకవర్గం పిప్రి నుంచి ప్రారంభించి ఖమ్మం నగరంలో ముగించారు. మొత్తం 109రోజులపాటు 1364కిలోమీటర్లు 36 నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కీలకంగా మారిన ఈ పాదయాత్ర ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభమైంది. ఎండకాలంలో సాగిన ఈ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. పాదయాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఉమ్మడి జిల్లాలో బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల మీదుగా ఆయన పాదయాత్ర సాగింది. గిరిజన, ప్రాంతాలతోపాటు మైదాన, సింగరేణి సమస్యలపై పలు హామీలు ఇచ్చారు. కార్నర్ మీటింగ్‌లతో స్థానికులతో మమేకమయ్యారు. ప్రస్తుత మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నీ తానై వ్యవహరించి భట్టి పాదయాత్రను విజయవంతం చేశారు. భట్టి పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని పలువురు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఆయనకు మద్దతు తెలుపుతూ యాత్రలో పాల్గొన్నారు.

అదే రోజు గుర్తుగా..

బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేయగా, తాజాగా అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో 'భట్టి' శనివారం వస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పథకంలో ధ్వంసం చేసిన రోడ్లతోపాటు డ్రైనేజీలను వెంటనే మరమ్మతు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే పట్టణ పరిధిలోని కూరగాయల మార్కెట్, బలిజవాడ, బొక్కలగూడెం, బెస్తవాడ, మహంకాళివాడల్లో మార్నింగ్ వాక్ చేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో కోట్లాది ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు. మిషన్ భగీరథతో చుక్క నీరు రాలేదని, రోడ్లు ఎక్కడికక్కడ నాశనం చేశారని విమర్శించారు. అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలని సూచించారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీశ్, అయిత హిమవంతరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, కొంపెల్లి బానేశ్, పెద్దింటి శ్రీనివాస్, చెన్నూరి రాజేశ్, బొడ్డు రాకేశ్, పబ్బా సంతోశ్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు

రామకృష్ణాపూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గెలిచిన మూడు నెలల్లోనే క్యాతనపల్లిలో అభివృద్ధి పనులకు రూ.70 లక్షలు మంజూరు చేయించినట్లు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సాయికుటీర్, ఇందిరానగర్‌లో శుక్రవారం రూ.19.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో సిబ్బంది కొరత తీర్చేందుకు సీఎంతో మాట్లాడతానని అన్నారు. లే-అవుట్ లేని ప్లాట్లకు అధికారులు అనుమతి ఇవ్వొద్దని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ మురళీకృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని డీఐఈవో శైలజ శుక్రవారం సందర్శించారు. మూల్యాంకనం కేంద్రానికి చేరిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల సమాధాన పత్రాలను పరిశీలించారు. మొదటి విడత ఈ నెల 16 నుంచి మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం(ఏ.బీ), పొలి టికల్ సైన్స్, 20 నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనా మిక్స్, కామర్స్, 24నుంచి బోటనీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనం చేపట్టనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ కాలేజీలకు సంబంధించిన ప్రిన్సిపాల్‌లు తప్పనిసరిగా షెడ్యూల్ ప్రకారం అధ్యాపకులను రిలీవ్ చేసి విధులకు హాజరయ్యేలా చూడాలని డీఐఈవో శైలజ తెలిపారు. విధులకు హాజరు కాని పక్షంలో చర్యలుంటాయని పేర్కొన్నారు.

'పెద్దపల్లి లోక్‌సభ టికెట్ మాదిగలకే ఇవ్వాలి'

చెన్నూర్: పెద్దపల్లి లోక్‌సభ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ మాదిగలకే ఇవ్వాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు కావస్తున్నా పెద్దపల్లి లోక్‌సభ టికెట్ మాదిగలకు ఇవ్వలేదని తెలిపారు. మాదిగలకు అవకాశం ఇవ్వకుండా రాజకీయ పార్టీలు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలో పరిధిలో మూడు లక్షల మంది మాదిగ కులస్తులు ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను విస్మరించాయని, కాంగ్రెస్ పార్టీ దళితులకు అవకాశం ఇస్తే గెలిపించుకుని తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ మాదిగల ఐక్యవేదిక కో కన్వీనర్ కొటగిరి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వే పనుల అడ్డగింత



అడ్డుకుంటున్న రైతులను వారిస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట: మండలంలోని ఇటిక్యాల గ్రామ గోదావరినది సమీపంలో చేపట్టిన 63వ జాతీయ రహదారి గ్రీన్ ఫీల్డ్ సర్వే పనులను గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. తమ పొలాల నుంచి రహదారి నిర్మాణం వద్దని ఆందోళనకు దిగారు. రహదారి నిర్మాణంలో తమ సాగుభూములు తీసుకుంటే జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తంజేశారు. రహదారిని వేరే ప్రదేశం గుండా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ రాఘవేంద్రరావు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రైతులు తిరుపతి, యశోద, లక్ష్మణ్, సుచిత్రను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

చెట్లు నరికినవారిపై చర్యలు

భీమారం: మంచిర్యాల అటవీడివిజన్ పరిధి పోతన్‌పల్లి అటవీ బీట్ పరిధిలోని అడవిలో గుర్తుతెలియని వ్యక్తులు యంత్రాల ద్వారా వివిధ రకాల 35 చెట్లను నరికినట్లు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ శుక్రవారం తెలిపారు. 'పోతన్‌పల్లి అడవిలో చెట్ల నరికివేత' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. నిందితులు భూమిని ఆక్రమించేందుకు చెట్లు నరికారా? లేక.. మరోకోణంలో విధ్వంసానికి పాల్పడ్డారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నరికిన చెట్ల విలువ రూ.16వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి దాదాపు 20 రోజులైనట్లు తెలిపారు. కాగా, చెట్ల నరికివేతపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని రేంజ్ ఆఫీసర్ పేర్కొన్నారు. నిందితులను గుర్తించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లయ్య

చెన్నూర్: చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పొన్న మల్లయ్యను పరిపాలనాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మల్లయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అటవీశాఖలో సూపరింటెండెంట్ హోదాలో విధులు నిర్వహిస్తున్న వారందరికీ ప్రభుత్వం గజిటెడ్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగుల కల సాకారం చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లయ్యను ఎఫ్‌డీవో రమేశ్, ఫారెస్ట్ సిబ్బంది, టీఎన్జీవో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏరియా సందర్శన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిని సింగరేణి సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు, ఎస్వో టూ జీఎం సెక్యూరిటీ వేణుమాధవ్ శుక్రవారం సందర్శించారు. ఏరియాలోని పలు సెక్యూరిటీ పోస్టులను తనిఖీ చేశారు. సంస్థకు సంబంధించిన సామగ్రి చోరీకి గురికాకుండా చూడాలని కోరారు. రక్షణ గోడలున్న చోట సామగ్రి భద్రపర్చాలని సూచించారు. ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పామ్‌పైనే ఆశలు



దేవునిగూడలో సాగవుతున్న ఆయిల్‌పామ్

- పంటసాగుపై అన్నదాతల ఆసక్తి
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఏపుగా పెరుగుతున్న మొక్కలు
- నాలుగేళ్ల తర్వాత నుంచి రాబడి
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

మంచిర్యాల జిల్లాలో సాగు వివరాలు

సాగు విస్తీర్ణం	894 ఎకరాలు
సాగు చేసిన రైతులు	223 మంది
ప్రస్తుతం క్వింటాల్ ధర	రూ.1,600

జన్నారం: వరికి ప్రత్యామ్నాయం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో మొదటిసారి సాగు ప్రారంభించారు. జన్నారం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా దేవునిగూడలో సాగు ప్రారంభించగా, ప్రస్తుతం కలమడుగు, జన్నారం తదితర గ్రామాల్లోనూ రైతులు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో 26మంది రైతులు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 223 మంది రైతులు 894 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హార్టికల్చర్ శాఖ అధికారులు, మ్యాట్రిక్స్ ఆయిల్‌పామ్ సంయుక్తంగా రైతులకు సహకారం అందిస్తోంది. భూమి ఉండి బోరుబావి లేదా వ్యవసాయ బావి ఉన్న రైతులు అర్హులు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నవారిలో జాబ్‌కార్డున్న సన్నకారు, చిన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం లాంటి పనులు చేయిస్తారు.

అధికారుల ప్రోత్సాహంతో..

రెండేళ్ల క్రితం వేసవిలో వరి సాగు వద్దని, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని అధికారులు గ్రామసభల్లో చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు గురించి కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. దీంతో సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఇందులో భాగంగా మ్యాట్రిక్స్ ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధులు రైతులకు అండగా నిలిచారు. జన్నారం మండలం దేవునిగూడకు చెందిన 15మంది రైతులు సాగుకు ముందుకువచ్చారు. వీరిని మ్యాట్రిక్స్ సంస్థ ప్రతినిధులు ప్రోత్సహించారు. హార్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారు. మూడు సంవత్సరాలు పూర్తి కావడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. మరో రెండేళ్లలో పంట చేతికి వచ్చే అవకాశముంది.

పంట అమ్మకం ఇలా..

నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల వరకు మొక్కలు పెరిగి గెలలు వేస్తాయి. ఎకరాకు రెండు టన్నుల పంట దిగుబడి వస్తుంది. పంట చేతికి రాగానే మ్యాట్రిక్స్ ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధులు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.1,600 ఉందని, ఇంకా పెరగనుందని అధికారులు చెబుతున్నారు. 15రోజుల కోసారి పంట కోస్తారు. 15రోజులకు ఎకరాకు సుమారు రూ.40వేల వరకు సంపాదించుకోవచ్చని అధికారులు తెలిపారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం

ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఎప్పటికప్పుడు సాగుపై సూచనలు చేస్తున్నాం. డ్రిప్‌తో పాటు మొక్కలు, ఎరువులు సబ్సిడీపై అందిస్తున్నాం. సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభం చేకూరుతుంది. నాలుగేళ్ల తర్వాత నుంచి పంట అమ్ముకోవచ్చు.

– సహజ, హార్టికల్చర్ అధికారి

తక్కువ పెట్టుబడితో..

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఖర్చు చాలా తక్కువ. ఎకరాకు 57 మొక్కలు నాటాలి. ఇందుకు రూ.1.50లక్షలు మొక్కలకు, రూ.15వేలు పాదులు తవ్వేందుకు, రూ.10 వేలు ఎరువుకు, ఇతర ఖర్చులతో మొత్తంగా ఎకరాకు రూ.2లక్షల వరకు ఖర్చు వస్తుంది. జాబ్‌కార్డున్న రైతులకు ఈజీఎస్ కింద మొదటి ఏడాది ఎకరాకు రూ.33వేలు, రెండో, మూడో సంవత్సరంలో రూ.13వేలు చొప్పున అందించి చేయూతనిస్తారు. హార్టికల్చర్‌శాఖ అధికారులు డ్రిప్‌తోపాటు సంవత్సరానికి రూ.4వేలు అందజేస్తారు. ఇలా నాలుగేళ్లు హార్టికల్చర్ అధికారులు రైతుకు ప్రోత్సాహం అందిస్తారు.

ఏరియా లక్ష్యం నెరవేరేనా?

- 43,98,620 టన్నుల ఉత్పత్తి టార్గెట్
- ఇప్పటివరకు 90శాతం పూర్తి
- 14రోజుల్లో 100శాతం సాధించేనా?



ఏరియా జీఎం కార్యాలయం

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి మందమర్రి ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఏరియాలో ఇంతవరకు 90శాతం ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఇంకా 14 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉండగా, రోజుకు సుమారు 16వేల టన్నుల ఉత్పత్తి చేసినా సంస్థ నిర్దేశించిన లక్ష్యం చేరుకోలేని పరిస్థితి. ఇందుకు కేకే–1గని, ఆర్కే–1ఏ గని మూసివేత, వర్షం ప్రభావమే కారణమని అధికారులు చెబుతున్నారు.

వర్షాలు, సమ్మెలే కారణమా?

మందమర్రి ఏరియాలో కేకే–5, కాసిపేట, కాసిపేట–1, శాంతిఖని, కేకే, ఆర్కే ఓసీలున్నాయి. సంస్థ ఏరియాకు 43,98,620 టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని ముందుంచింది. కాగా, ఏరియాలో వర్షాలు పడకుండా, సమ్మెలు చేయకుండా ఉంటే రోజుకు సుమారు 16వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే ఆస్కారముండేది. గురువారం వరకు ఏరియాలో 39,73,499 టన్నుల ఉత్పత్తి మాత్రమే జరిగింది. లక్ష్యానికి ఇంకా 14రోజుల గడువు మాత్రమే ఉంది. కాగా, ఈ గడువులో 2.20 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించే అవకాశం మాత్రమే ఉండగా లక్ష్యం చేరే అవకాశం కనిపించడంలేదు.

ఏరియాలో ఉత్పత్తి వివరాలు

మందమర్రి ఏరియాలో 2023–24 ఆర్థిక సంవత్సరం శాంతిఖనిగనిలో 63,898 (28శాతం) టన్నులు, కేకే–16,331 (54శాతం) టన్నులు, కేకే–5గనిలో 1,87,994 (98 శాతం) టన్నులు, కాసిపేట గనిలో 1,39,510 (44 శాతం) టన్నులు, ఆర్కే–1ఏ 23,077 (58 శాతం) టన్నులు, ఆర్కే ఓసీలో 17,68,328 (127శాతం) టన్నులు, కాసిపేట–2 గనిలో 93,323 (33 శాతం)టన్నులు, కేకే–ఓసీలో 16,81,040 (88 శాతం) టన్నుల ఉత్పత్తి జరిగింది. మొత్తంగా 90శాతం ఉత్పత్తి జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యం సాధిస్తాం



ఇప్పటివరకు ఏరియాలో 90శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది. ఏరియాలోని గనులపై ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులకు సంస్థ సీఎండీ, డైరెక్టర్ల ఆదేశాలు, సూచనలు తెలియజేస్తున్నాం. వారికి ఉత్పత్తిపై అవగాహన కల్పిస్తున్నాం. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సమష్టి కృషితో సాధిస్తాం.

– మనోహర్, జీఎం, మందమర్రి ఏరియా

టెక్నికల్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

- మృత్యువుతో పోరాడుతున్న రాకేశ్
- అధికారుల వేధింపులే కారణమని కుటుంబీకుల ఆరోపణ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేశ్

జన్నారం: తన కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేయగా, మానసికంగా కుంగిపోయిన నీటిపారుదల శాఖ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం చేసి మృత్యువుతో పోరాడుతున్నాడు. బాధితుడి తల్లి తోకల సరస్వతి, తమ్ముడు విషేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం గ్రామపంచాయతీకి చెందిన తోకల రాకేశ్ కడెం నీటి పారుదలశాఖ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలలుగా రాకేశ్‌ను ఇదే కార్యాలయంలోని సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేస్తున్నారు. గతంలో ఇలాగే వేధింపులకు పాల్పడగా, రాకేశ్ తండ్రి వారికి ఫోన్ చేసి బెదిరించాడు. మూడు నెలల క్రితం రాకేశ్ తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. అప్పుడు రాకేశ్ 15రోజులు సెలవు తీసుకున్నాడు. తిరిగి విధుల్లో చేరిన రాకేశ్‌ను కొంతకాలంగా మళ్లీ వేధిస్తున్నారు. ఈ విషయం రాకేశ్ ఇంట్లో చెప్పాడు. తన తండ్రి మూడు నెలల కర్మ కోసం సెలవు అడగగా సదరు అధికారులు వేధింపులకు గురి చేశారు. ఈ వేధింపులు భరించలేక రాకేశ్ గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రాకేశ్ తల్లి సరస్వతి తెలిపింది. తన కుమారుడిని వేధింపులకు గురిచేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. కాగా, ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ బోజదాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా, రాకేశ్‌ను కార్యాలయంలో ఎవరూ వేధింపులకు గురి చేయలేదని తెలిపారు. గురువారం విధులకు హాజరై వెళ్లాడని, అతడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై సతీశ్‌ను కూడా 'సాక్షి' వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రమోషన్ పత్రాల పంపిణీ



ప్రమోషన్ పత్రాలు ఇస్తున్న శ్రీనివాస్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో పలువురు కార్మికులకు యాక్టింగ్ ఆధారిత ప్రమోషన్ పత్రాలు అందించారు. శుక్రవారం గనిపై జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ ప్రమోషన్ పొందిన ఉద్యోగులకు ఆర్డర్ కాపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి రక్షణతో పని చేయాలని, పదోన్నతులు పొందిన వారు మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. గని మేనేజర్ సుధీర్ జక్కుల్‌వార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్రశేఖర్, పిట్ సెక్రటరీ మోతే లచ్చన్న, రక్షణాధికారి శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి కమ్రుద్దీన్, సంక్షేమాధికారి శంకర్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



ప్రభు (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధి చిచ్‌పల్లి గ్రామానికి చెందిన పెందోర్ ప్రభు (30) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం భార్యతో గొడవపడి ఇంట్లోని వస్తువులు అమ్ముకుంటూ మద్యం తాగేవాడు. ఈక్రమంలో ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమి అమ్మేశాడు. ఇతడి తీరు నచ్చని అతడి భార్య విడాకులిచ్చింది. దీంతో ప్రభు అప్పటినుంచి ఇంట్లో ఒంటరిగా ఉంటూ నిత్యం మద్యం తాగేవాడు. ఈ క్రమంలో నాలుగునెలల క్రితం కూలీ పని చేసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. శివరాత్రి పండుగకు స్వగ్రామానికి వచ్చిన ప్రభు మళ్లీ మద్యం తాగుతూ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం మద్యం తాగి వచ్చి రాత్రి 11గంటలకు పక్కనే ఉండే వరుసకు తమ్ముడైన పెందూర్ వినోద్ వాళ్ల ఇంటికి అన్నం అడిగేందుకు వెళ్లాడు. వాళ్లు నిద్రలో ఉండగా తిరిగి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం నుంచి ప్రభు బయట కనిపించలేదు. వరుసకు చిన్నమ్మ అయిన దుర్పతబాయి సాయంత్రం 4గంటలకు అతడి ఇంటికి వెళ్లి చూడగా దూలానికి ఉరేసుకుని కనిపించాడు. మృతుడి అక్క కనక భీంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



కొండయ్య (ఫైల్)

వాంకిడి: ప్రమాదవశాత్తు జారిపడి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన పగ్గె కొండయ్య (53) స్థానిక సీఎఫ్‌సీలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న ఉదయం సీఎఫ్‌సీకి పనికి వెళ్లిన కొండయ్య ఆరోగ్యం సహకరించకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మంచం పైనుంచి లేచి నిలబడగా కళ్లు తిరిగి కింద పడ్డాడు. దీంతో కుడి కణతపై దెబ్బ తగిలి తీవ్ర రక్తస్రావమైంది. అతడు స్పృహ కోల్పోగా గమనించిన అతడి భార్య కవిత వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించింది. అనంతరం కుటుంబసభ్యుల సాయంతో కరీంనగర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- పెళ్లికి వెళ్లి వస్తుండగా ఘటన



ఆటోలోని వ్యక్తిని బయటికి తీస్తున్న ప్రజలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సుర్దాపూర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్పూర్(యూ) మండలం రుద్రకసకు చెందిన మడావి మారు (57) మృతి చెందాడు. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రకసకు చెందిన ఒకే కుటుంబంలోని ఏడుగురు ఆటోలో ఆసిఫాబాద్ మండలం శేకన్‌గొందిలో జరిగిన వివాహానికి హాజరై శుక్రవారం తిరుగుపయనమయ్యారు. ఈక్రమంలో మండలంలోని సుర్దాపూర్ గ్రామ సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న అంబారావుగూడకు చెందిన బొలెరో పికప్ వ్యాన్ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఇందులో ప్రయాణిస్తున్న మడావి మారు అక్కడికక్కడే మృతి చెందాడు. మడావి భీంరావు, గిరిజాబాయి, భీంబాయికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి భార్య చిన్నుబాయి ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపి మాట్లాడుతున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: ముగ్గురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక డీసీపీ అశోక్‌కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలు తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. జైపూర్ మండలం రసూల్‌పల్లి బస్టాండ్ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.38,375 విలువ చేసే 1,535 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించాయి. గంజాయితోపాటు వారి నుంచి రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మహారాష్ట్ర నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వీరు కొంతకాలంగా మంచిర్యాల, గోదావరిఖని, జైపూర్ ప్రాంతాల్లో గంజాయి విక్రయించారు. గంజాయితో పట్టుబడ్డ నిందితుల్లో వాంకిడి మండలం ఖిర్డి గ్రామానికి చెందిన కొట్రాంగే దాతు, మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రామటెంకి ఉదయ్‌కుమార్, జైపూర్ మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన లక్కాకుల శివసాయి ఉండగా వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో దాతు గంజాయి తీసుకువస్తూ ఇక్కడ శివసాయి, ఉదయ్‌కుమార్‌తో విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టనున్నట్లు డీసీపీ తెలిపారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న జైపూర్ పోలీసులను సీపీ శ్రీనివాసులు, డీసీపీ అశోక్‌కుమార్ అభినందించారు.

సెక్యూరిటీ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (ఎస్అండ్‌పీసీ) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద సెక్యూరిటీ జీఎం దీక్షితులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, నాయకులు ముస్కె సమ్మయ్య, ఎస్కె బాజీ సైదా మాట్లాడారు. సింగరేణి సెక్యూరిటీ గార్డులు పని భారంతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బంది కొరత అధికంగా ఉందని తెలిపారు. వెంటనే ఇంటర్నల్ నుంచి సెక్యూరిటీ గార్డుల నియామకం చేపట్టాలని కోరారు. ఫ్లైడేలు, పీహెచ్‌డీలు కల్పించాలని, చెక్‌పోస్టులు ఆధునికీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంటీఎఫ్, ఇంటెలిజెన్స్ కార్యాలయాల్లో చాలాకాలంగా పనిచేస్తున్న సిబ్బందిని తొలగించి రొటేషన్ పద్ధతిలో కేటాయించాలన్నారు. యూనిఫామ్, సేఫ్టీ మెటీరియల్ సకాలంలో అందించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, పిట్ కార్యదర్శి ఆడెపు మల్లికార్జున్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు అశోక్, శ్రీధర్, సదానందం, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు' ఇవ్వకపోవడం సరికాదు



మాట్లాడుతున్న వెంకటస్వామి

బెల్లంపల్లి: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన కార్మిక సంఘానికి గుర్తింపు పత్రాలు అందించకుండా, కార్పొరేట్, ఏరియా స్థాయి స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం శాంతిఖని గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరిగి మూడు మాసాలు గడుస్తున్నా ఇంతవరకు గెలిచిన సంఘానికి గుర్తింపు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గెలిచిన సంఘాన్ని నామమాత్రంగా చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలకులు మారినంత మాత్రాన కార్మికులకు కలిగే ప్రయోజనం ఏమీలేదని విమర్శించారు. సింగరేణిలో పారిశ్రామిక సంబంధాలు అడుగంటిపోతున్నాయని, కంపెనీలో రాజకీయ జోక్యం నేటికీ కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. గుర్తింపు సంఘానికి పత్రాలు అందజేసి సింగరేణి యాజమాన్యం సమావేశాలకు ఆహ్వానించాలన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, పిట్ సెక్రటరీ తిరుపతిగౌడ్, నాయకులు లింగయ్య, రమేశ్, రాంచందర్, స్వామిదాస్, భాస్కర్ రామ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభావిత ప్రాంతవాసులకు అధిక ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి అవుట్ సోర్సింగ్ కార్మికులుగా సింగరేణి ప్రభావితప్రాంత వాసులు, భూ నిర్వాసితులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ సూచించారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియాలోని సివిల్ కాంట్రాక్టర్లు, సివిల్ ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా 80శాతం స్థానికులకే అవకాశం కల్పించాలని సూచించారు. కాంట్రాక్టు కార్మికుల నియామకంలో కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించి స్థానికులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఏరియా పరిధిలో సివిల్ పనులు నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఏరియా ఉత్పత్తి, సివిల్ పనుల్లో ముందుందని అందుకు కాంట్రాక్టర్ల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. సకాలంలో నాణ్యతతో కూడిన పనులు చేపట్టి ఏరియాను అన్ని విభాగాల్లో ముందుండేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీఎం సివిల్ సతీశ్‌బాబు, ఈఈ రాజేంద్రప్రసాద్, సివిల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌కు ఎంపిక



లక్కీ డ్రా తీస్తున్న అదనపు కలెక్టర్ సబావత్‌మోతీలాల్

పాతమంచిర్యాల: 2024–25 విద్యాసంవత్సరానికి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సమక్షంలో లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లాకు రెండు సీట్లు కేటాయించగా 32మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో 26 మంది లక్కీడ్రాకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. లక్కీడ్రాలో హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లికి చెందిన కాంపెల్లి సాయిహర్ష, కోటపల్లి మండల కేంద్రానికి చెందిన కొంకటి ఆరాధ్య ఎంపికైనట్లు తెలిపారు. వెయిటింగ్ లిస్టులో మందమర్రికి చెందిన కాదాసీ సుహన్, చందారానికి చెందిన గోగర్ల సెలెన మహంతి ఉన్నట్లు వివరించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఉపసంచాలకుడు పోటు రవీందర్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సుల్తాన్‌గూడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రానగర్‌కు చెందిన బెండారే కృష్ణ, బారేమోడికి చెందిన వాడై అర్జున్ కెరమెరి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. శుక్రవారం పాఠశాలలో పరీక్షల హాల్‌టికెట్లు తీసుకుని బైక్‌పై కెరమెరి నుంచి కెస్లాగూడ వైపు వెళ్తున్నారు. సుల్తాన్‌గూడ సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. అజయ్‌కి తల, ఛాతి, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంపీపీ పెందోర్ మోతీరాం ఘటనా స్థలానికి వెళ్లి ఇద్దరిని కెరమెరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో మంచిర్యాలకు తరలించారు. అజయ్ పరిస్థితి విషమించగా అతడిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు.